## కార్యాలయాలు బురదమయం

బురద మయంగా ఉన్న రెవెన్యూ కార్యాలయాల ఆవరణ

మంథని, జూలై 28: మంథనిలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల సముదాయం బురదమయమైంది. దాదాపు పదిహేను రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కార్యాలయాల ప్రాంగణాల్లో నీరు నిలిచి, నడవడానికి కూడా వీలు లేకుండా మారింది. ప్రతీ రోజు వివిధ పనుల కోసం ఈ రెండు కార్యాలయాలకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కానీ కార్యాలయాల ఆవరణలు బురదగా మారి రాక పోకలు సాగించే వీలు లేకుండా పోతున్నది. తమ చేతుల్లోనే మట్టి, ఇసుక, కంకర, మొరం వంటి వాటికి అనుమతులు ఇచ్చే రెవెన్యూ అధికారులు తమ కార్యాలయాల ఆవరణల్లో ప్రజలకు, సిబ్బందికి ఇబ్బంది కలగకుండా చర్యలు మాత్రం చేపట్టడం లేదు. డివిజన్, మండల పాలనాధికారులు కొలువుదీరిన కార్యాలయాల ఆవరణ ఈ విధంగా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రజల ఇబ్బందులను గుర్తించి బురద రోడ్డుతో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రాకపోకలు నిలిపివేత

కొనసాగుతున్న వరద ప్రవాహం

పెద్దపల్లి రూరల్, జూలై 28: కొద్దిరోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి. అక్కడక్కడ మత్తళ్లు దుంకుతుండగా రోడ్‌లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షం ఆదివారం కొంతమేర తగ్గుముఖం పట్టినప్పటికి పై నుంచి వస్తున్న వరదనీటి ప్రవాహం ఇంకా తగ్గక పోవడంతో పెద్దపల్లి మీదుగా కొలనూర్, ఓదెల మీదుగా జమ్మికుంటవైపు వెళ్లే ప్రయాణికుల రాకపోకలను నిలిపి వేసిన అధికారులు ఇంకా పునరుద్ధరించలేదు.

## కన్నాల ఎల్-6 కెనాల్‌కు బుంగ

మంథని రూరల్, జూలై 28: మండలంలోని ఎల్–6 కెనాల్ బుంగ పడడంతో వరి పంటలు నీట మునిగాయి. డీ–83 లింక్ నుంచి ఎల్–6 కెనాల్ ద్వారా మంథని మండలం అక్కెపల్లి, పాత రచ్చపల్లి, కన్నాల, నాగారం, మల్లేపల్లి, గుంజపడుగు, విలోచవరం, పోతారం, ఉప్పట్ల, మంథనిలోని పంట పొలాలకు సాగునీరు అందుతుంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కన్నాలలోని ఎల్–6 కెనాల్ వద్ద బుంగ పడింది. దీంతో కెనాల్ కిందనే ఉన్న గుడిసె గట్టయ్య, రాజయ్య, కుమార్‌లకు చెందిన దాదాపు 15 ఎకరాల వరి పొలాలు మొత్తం నీట మునిగాయి. అధికారులు ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోకపోవడంతో ఎల్–6 కెనాల్‌కు పడ్డ బుంగ ద్వారా భారీగా నీరు చేరి తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కెనాల్‌కు పడ్డ బుంగకు మరమ్మత్తులు చేయాలని రైతులు కోరుతున్నారు.


నీట మునిగిన వరి పొలం

**వర్షానికి కూలిన ఇండ్లు**

కన్నాల, విలోచవరం గ్రామాల్లో ఆదివారం రెండు ఇండ్లు కూలి పోయాయి. కన్నాలలో చెందిన పోయిల రాయమల్లు, ఆయన సోదరుడు పోయిల రాములుకు చెందిన ఇల్లు పూర్తిగా కూలి పోయింది. విలోచవరంలో తాటి అనసూయకు చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఈ రెండు ఇండ్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు. ఇల్లు కూలి పోయిన వీరికి ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చీమలపేటలో రోడ్డుపై చేరిన వరద

## తెగిన బంధం

జూలపల్లి, జూలై 28 : జూలపల్లి మండలం చీమలపేటలో గ్రామస్తుల మధ్య సంబంధాలు తెగిపోయాయి. వరద తెచ్చిన ముప్పుతో గ్రామస్తుల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వారం నుంచి ఎడ తెరిపి లేని వానలకు గ్రామం మధ్యలో ఉన్న తారురోడ్డు మునిగి పోయింది. దాదాపు రెండున్నర ఫీట్ల దాకా వరద నీరు తారురోడ్డుపై చేరింది. దీంతోపాటు చీమలపేట–ఎలిగేడు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు తొంటి బీరయ్య అనే రైతు ఫిర్యాదు చేశాడు. బ్యాక్ వాటర్‌తో తన రెండెకరాల వరి పంట నీట మునిగిందనీ, రోడ్డుపై నిలిచిన వరద నీరు తొలగించాలని కోరాడు. అయినప్పటికి అధికారులు ఏలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నాడు. తారు రోడ్డును ఆనుకుని ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని నివాస గృహల్లోకి వరద నీరు చేరుకుని ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల పట్టించుకోకపోవడంతో అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వరద నీరు తొలగించడానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

## సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సీపీఐ నిరసన

కోల్‌సిటీ, జూలై 28: గోదావరిఖనిలోని రాజీవ్ రహదారికి ఇరువైపులా సర్వీస్ రడ్ల నిర్మాణం సరిగ్గా చేపట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్ అన్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని సర్వీస్ రోడ్డు వద్ద ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. గోదావరి వంతెన నుంచి రామగుండం తహసీల్దార్ కార్యాలయం వరకు సర్వీస్ రోడ్డు అక్కడక్కడ చేపట్టి వదిలేశారని వారన్నారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం పూర్తి చేయకుండానే హెచ్‌కేఆర్ సంస్థ బసంత్‌నగర్‌లో టోల్‌గేట్ ఏర్పాటు చేసి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని వాపోయారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోసిక మోహన్, జిల్లా మాజీ కార్యదర్శి గౌతం గోవర్ధన్, నాయకులు తాళ్లపల్లి మల్లయ్య, మాటేటి శంకర్, రమేశ్‌కుమార్, మార్కపురి సూర్య, ప్రీతం, కనకయ్య, కనకరాజు, నవీన్, శివ, జయపాల్ రెడ్డి, జగన్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## పెద్దమ్మ దేవాలయంలో చోరీ

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 28: గోదావరిఖని పట్టణ శివారులోని రాజీవ్ రహదారిని అనుకొని ఉన్న పెద్దమ్మ దేవాలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళం వేసి ఉన్న గుడి తాళం పగులగొట్టి వెండి, ఇత్తడి వస్తువులతో పాటు శఠగోపాన్ని తస్కరించారు. వీటి విలువ రూ. 41,200 అభరణాలను ఎత్తికెళ్లారు. ఆలయ నిర్వహకుల ఫిర్యాదు మేరకు ఆదివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేపట్టారు.

## 'ఈదునూరి'కి జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు

కోల్‌సిటీ, జూలై 28: గోదావరిఖనికి చెందిన స్వచ్ఛంద యువజన నాయకుడు ఈదునూరి శంకర్ మరో జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైనట్లు ఆలిండియా యూత్ ఫౌండేషన్ టీం జెనిత్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు డా మనీష్ గవాయి, మీతిన్ కలాంటి ప్రకటించారు. ఆగస్టు 12న న్యూఢిల్లీలో నేషనల్ కల్చరల్ ఫెస్టివల్–2024 పేరుతో ఆలిండియా యూత్ ఫౌండేషన్ టీం సంస్థ ప్రత్యేక వేడుకలను నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు హాజరు కావాలని ఈదునూరి శంకర్‌కు ఆదివారం ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ హరీష్ మల్హోత్రా, కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు. జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైన శంకర్‌ను పలువురు అభినందించారు.

# ఊరూరా బోనాల వేడుకలు

బోనమెత్తుకున్న ఫోక్ సింగర్ కనకవ్వ

పెద్దపల్లి, జూలై28: జిల్లాలో ఆదివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దపల్లి శివారులోని ఎల్లమ్మ చెరువు కట్ట, మినీ ట్యాంక్ బండ్ వద్ద కట్ట మైసమ్మకు భక్తులు ఆషాడ మాసం బోనాలు సమర్పించారు. 12వ వార్డు సాగర్ రోడ్డు మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి హాజరయ్యారు.బోనమెత్తి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కౌన్సిలర్లు సరేశ్‌బాబు, కొలిపాక శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు. పెద్దపల్లిలోని పోచమ్మ వాడ మహిళలు ముత్యాల పోచమ్మకు బోనాలు సమర్పించారు.

కోల్‌సిటీ/ఫర్టిలైజర్‌సిటీ/జ్యోతినగర్, జూలై 28: గోదావరిఖని గంగానగర్‌లో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. జానపద, సినీ నేపథ్య గాయకురాలు కనకవ్వ ముదిరాజ్ మహిళలతో కలిసి ఆటపాటలతో సందడి చేశారు. అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి, జంగపల్లి సరోజన, అనవేన సంధ్యారాణి, మల్లయ్య, కొలకని సాంబయ్య, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్టీపీసీ మేడిపల్లిలో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో మడలేశ్వరి పోచమ్మ బోనాలు చేశారు. ఇక్కడ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, రజక సంఘం నాయకులు పుసాల శ్రీనివాస్, భూమయ్య, గోపాల్, శ్రీనివాస్, గణేశ్, కిష్టయ్య ఉన్నారు. రామగుండం 42వ డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌లో బోనాల వేడుకలు అలరించాయి. కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, డివిజన్ మహిళలు పాల్గొన్నారు. ఎన్టీపీసీకి చెందిన గౌడ కులస్తులు రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు చేరుకున్న మహిళలు పోతరాజుల వేషధారణలు, శివసత్తుల నృత్యాలతో డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు ఎత్తుకోని ఊరేగింపుగా స్థానిక భీమునిపట్నంలోని అమ్మవారి ఆలయానికి చేరుకోని బోనాలను సమర్పించి ప్రసాదాలను స్వీకరించారు.

# కేటీఆర్ అల్టిమేటంతోనే నీటి విడుదల

- బీఆర్ఎస్ నాయకుల స్పష్టీకరణ

నంది పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్‌ల వద్ద బీఆర్ఎస్ నాయకులు

ధర్మారం,జూలై28:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అల్టిమేటంతోనే రాష్ట్రం ప్రభుత్వం ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేసిందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. నంది మేడారంలోని నంది పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న డెలివరి సిస్టర్న్‌లను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ జలాలు విడుదల చేయకుటే 50 వేల మంది రైతులతో వెళ్లి పంపులు ఆన్ చేస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హెచ్చరించడం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కేటీఆర్ సందర్శించి ఆగస్టు 2 లోగా ఎత్తిపోతలు చేపట్టాలని డిమాండ్ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గిందన్నారు. ఇది రైతుల విజయమని వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎప్పటికీ రైతుల పక్షమేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కొన్ని పిల్లర్లు కుంగడంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై బురద జల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నా కాళేశ్వరం ప్రాజెక్ట్ చెక్కు చెదరలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్, బీజేపీలు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై తప్పులు ప్రచారాలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నంది మేడారం సింగిల్ విండో చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు పూస్కూరు జితేందర్‌రావు,పాకాల రాజయ్య,చొప్పరి చంద్రయ్య,పెంచాల రాజేశం,దేవి నళినికాంత్,దేవి వంశీక్రిష్ణ,నాడెం శ్రీనివాస్,ఆవుల శ్రీనివాస్,ఆవుల వేణు, ఎండీ అజాం బాబా,మానుపాటి శ్రీనివాస్, సాగర్,కల్లెపల్లి లింగయ్య,బాలసాని తిరుపతి,కాంపెల్లి రాజయ్య,ఎండపల్లి సింహాచలం జగన్,చుంచు మల్లేశం, ఎండీ రియాజ్ పాల్గొన్నారు.

## ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై లేదు

గోదావరిఖని, జూలై 28: సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిపై యాజమాన్యం చూపుతున్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలకు ఇవ్వడం లేదని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మదాసు రామమూర్తి అన్నారు. జీడీకే 2 ఇంక్లైన్ గని ప్రమాదంలో గాయపడి సింగరేణి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న ముగ్గురు కార్మికును ఆదివారం పరామర్శించిన అనంతరం మాట్లాడారు. గని కప్పు కూలడానికి సిద్ధంగా ఉన్న సంకేతాలు వస్తున్నప్పటికీ కార్మికులను పనిచేయాలని ఒత్తిడి చేశారని ఆరోపించారు. సింగరేణి సీఎండీ ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ నాయకులు పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీశ్, చెలుకలపల్లి శ్రీనివాస్, దుటా శేషగిరి, ఉప్పులేటి పర్వతాలు, పల్లె సురేందర్, పులిపాక శంకర్, ఐలయ్య ఉన్నారు.

## వకీల్‌పల్లి గని సందర్శన

యైటింక్లయిన్ కాలనీ, జూలై 28: సింగరేణి ఆర్జీ–2 వకీల్‌పల్లి గనిని డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. ముందుగా సర్వే ప్లాన్ ద్వారా గనిలో నడుస్తున్న కంటిన్యూయస్ మైనర్, ఎల్‌హెచ్‌డీ పని స్థలాలు, పని పరిస్థితులను, గని జీవిత కాల పరిమితులను, ఉత్పత్తి ఉత్పాదకత గురించి సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఏరియా జీఎం సూర్యానారాయణతో కలిసి గనిలోకి దిగి 1 సీమ్ పని స్థలాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్‌వోటు జీఎం వెంకటేశ్వరావు, అడిషనల్ మేనేజర్ తిరుపతి, సేఫ్టీ అధికారి రాంకుమార్, డీవైఎస్‌ఎస్‌ఓ అక్బర్ పాషా, సెక్యూరిటీ అధికారి షరీఫ్, అజయ్‌కుమర్ రాజు తదితరులున్నారు.

## వన మహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలి

మంథని రూరల్, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని మంథని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ కోరారు. ఆదివారం మండలంలోని వెంకటాపూర్ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో వన మహోత్సవంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ సోనీ కిరణ్, బీట్ ఆఫీసర్లు రామ్మూర్తి, రాజు, ప్రదీప్, పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సాగర్, పాఠశాల ప్రిన్సిపాల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న గోరింటాకు వేడుకలు

కోల్‌సిటీ, జూలై 28: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక భవన్‌లో గోరింటాకు వేడుకలు అలరించాయి. ముందుగా సహజంగా పెరిగిన మైదాకు తీసుకవచ్చి గౌరీ దేవికి పూజ చేసి ఆ తర్వాత రోటిలో వేసి అంతా కలిసి నూరి ఒకరికొకరు చేతులకు గోరింటాకు పెట్టుకున్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఏటా ఆషాడ మాసంలో గౌరీ దేవికి ప్రతిరూపమైన మైదాకును నెలలో ఒకసారైనా మహిళలు తమ చేతులకు పెట్టుకుంటే ఆరోగ్యం, సౌభాగ్యం కలుగుతుంద న్నారు. సభ్యులు మనీషా అగర్వాల్, కళావతి, శశికళ, ఉమారాణి, జయప్రద, రంగమ్మ, పార్వతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఓదెల, జూలై 28: ఓదెల తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్‌లో గర్ల్స్ హాస్టల్‌లో వాచ్ ఉమెన్(చౌకిదార్) పోస్ట్ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి ఆగస్టు 3వరకు దరఖాస్తులు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, 18 ఏళ్లు నిండిన ఓసీ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పోస్టుకు సెక్యూరిటీ ఏజెన్సీ నుంచి శిక్షణ పొందిన అనుభవం గల వారు అయి ఉండాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న సీఐ రాజు

మంథని, జూలై 28: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని మంథని సీఐ బీ రాజు హెచ్చరించారు. స్థానిక పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేశారు. వాహనాల పత్రాలను పరిశీలించడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని, పత్రాలు లేని వాహనదారులకు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. ఆయన వెంట రామగిరి ఎస్ఐ సందీప్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## గని ప్రమాద బాధితులను పరామర్శించిన సీఎండీ

బాధితుడిని పరామర్శిస్తున్న సీఎండీ బలరాం నాయక్

గోదావరిఖని, జూలై 28: జీడీకే ఇంక్లైన్ గనిలో శనివారం జరిగిన ప్రమాదంలో గాయపడి ముగ్గురు కార్మికులు శంకర్, నోయల్, సంపత్‌లను సింగరేణి సీఎండీ ఎన్ బలరాం నాయక్ పరామర్శించారు. మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌కు తరలి దవాఖానలో చికిత్సపొందుతున్న బాధితులను ఆదివారం రాత్రి గచ్చిబౌలి ఒమేగా దవాఖానకు వెళ్లి పరామర్శించిన సీఎండీ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగావారికి ప్రాణాపాయం లేదని తెలిపిన వైద్యులు పేర్కొన్నారు. అనంతరం సీఎండీ బాధిత కుటుంబాలను కలిసి ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని, త్వరలోనే వారు పూర్తిగా కోలుకుంటారని వారికి భరోసా కల్పించారు. వైద్య సేవలపై ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని డీవైసీఎంవో డాక్టర్ బాలకోటయ్యను సీఎండీ ఆదేశించారు.

**గని ప్రమాద బాధితులకు పరామర్శ**

సింగరేణి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధిత కార్మికులను ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఈ ప్రమాదానికి కారకులైన అండర్ మేనేజర్ పై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపెల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు ఉన్నారు. సీఐటీయూ ఆర్జీ–1 బ్రాంచీ అధ్యక్ష, కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్ పరామర్శించారు. బాధ్యులైన అధికారుల ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ యూనియన్ నాయకులు ఆసరి మహేశ్, పీ సమ్మయ్య, దాసరి సురేశ్, తాళ్ళ శ్రీనివాస్, రాకేశ్, సందీప్, నంది నారాయణ ఉన్నారు.

**బాధిత కుటుంబానికి అండగా..**

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 28: గని ప్రమాద బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేశ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడారు. ప్రమాద సంఘటనపై ఎమ్మెల్యే సింగరేణి సీఎండీని కోరారన్నారు. ఇక్కడ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా, కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, ధూళికట్ట సతీశ్, కరుణాకర్ ఉన్నారు.

**ప్రమాద ఘటనకు నిరసనగా 30న దీక్ష**

సింగరేణిలో జరుగుతున్న వరుస గని ప్రమాదాలపై ఈ నెల 30న ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరసన దీక్ష చేపడుతున్నట్లు టీబీజీకేఎస్ ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే దీక్షలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయ్యాలని పిలుపునిచ్చారు.

**ప్రమాదంపై విచారణ జరిపించాలి**

జీడీకె 2 ఇంక్లైన్ గని ప్రమాదంపై పూర్తి విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ప్రకటనలో డిమాండ్ చేశారు. అండర్‌గ్రౌండ్‌లో రక్షణ చర్యలను యాజమాన్యం గాలికి వదిలేసిందన్నారు. రక్షణ శాఖ సేఫ్టీ అధికారి నిర్లక్ష్యమే ప్రమాదానికి కారాణమని ఆయన ఆరోపించారు. వెంటనే యాజమాన్యం ప్రమాద ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని, లేనిపక్షంలో హ్యూమాన్ రైట్స్ ఫోరమ్స్ హైకోర్టుకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రోడ్డు పక్కన వనమహోత్సవం మొక్కలు

రోడ్డు పక్కన పడేసిన మొక్కలు

పెద్దపల్లి రూరల్, జూలై 28: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమం ఆదిలోనే అభాసు పాలవుతున్నది. వనమహోత్సవం కార్యక్రమంలో పెద్దపల్లి నుంచి కొత్తపల్లి మీదుగా కొలనూర్ ఓదెల మండలాలకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా అధికారులు మొక్కలు నాటించారు. ఇదిలా ఉండగా వనమహోత్సవంలో మొక్కలు నాటడం అయిపోగానే మిగిలిన మొక్కలను సమీప నర్సరీలకు తరలిచాల్సి ఉండగా సంబంధిత అధికారులు అవేమి పట్టనట్లు మాకేందిలే మాపని అయిపోయింది అన్నట్లు కొత్తపల్లి–దస్తగిరిపల్లి గ్రామాల మధ్య రోడ్డుపక్కన నిర్లక్ష్యంగా పడేశారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సుల్తానాబాద్, జూలై 28: పట్టణంలో సోమవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏ ఈ రంగు శంకరయ, తెలిపారు. పట్టణంలో లూజ్ లైన్లు బిగించడం, లైన్లకు తగులుతున్న కొమ్మలు తొలగించడంలో భాగంగా విద్యుత్ నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలకు సీఎస్ఈ (ఏఐఎంఎల్) అనుమతి

- విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

దాసరి ప్రశాంత్ రెడ్డి

పెద్దపల్లి కమాన్, జూలై 28 : పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాల–2024 సంవత్సరానికి జేఎన్టీయూ బీటెక్ సీఎస్ఈ ఏఐఎంఎ ల్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లర్నింగ్) కోర్సుకు రెండో ఫేస్ తెలంగాణ కౌన్సింగ్‌కు అనుమతి లభించినట్లు ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 2024లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ అండ్ మెషిన్ లర్నింగ్) కోర్సు జేఎన్టీయూ, రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు పొంది ... రెండో దశ కౌన్సిలింగ్‌లో అందుబాటులో ఉంచినట్లు, ఈ విషయాన్ని గమనించి విద్యార్థులు తమ కళాశాలను మొదటి ఆప్షన్‌గా ఎంచుకోవాలని కోరారు. కంపెనీల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడి జూనియర్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తున్నారని అన్నారు. కళాశాల అనుభవం, వినూత్నమైన కోర్సులు గమనించి దూర ప్రాంతాలకు వెళ్లి మోసపోకుండా తమ ముంగిట్లో ఉన్న ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు చేరి తమ యొక్క బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు.

## బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

నివాళులర్పిస్తున్న కోరుకంటి చందర్, దాసరి ఉష

పెద్దపల్లి రూరల్, జూలై 28: పెద్దపల్లి ఎంపీపీ బండారి స్రవంతి భర్త శ్రీనివాస్‌గౌడ్ తండ్రి బండారి చంద్రయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తోపాటు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీఎస్‌టీఎస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమిల్ల రాకేశ్, మహిళా నాయకురాలు దాసరి ఉష పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రయ్య మృతికి గల కారణాలను కుమారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## సేఫ్టీ అధికారిపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి, జూలై28: ఆర్జీ –1లోని టూ ఇంక్లైన్ అండర్ గ్రౌండ్ మైన్‌లో శనివారం రాత్రి రెండో షిఫ్ట్‌లో బొగ్గు పొర కూలి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని, ఈ ప్రమాదానికి సింగరేణి యాజమాన్యం, రక్షణ శాఖ సేఫ్టీ ఆఫీసర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తరచూ రామగుండం రీజియన్‌లో అండర్ గ్రౌండ్, ఓపెన్ కాస్ట్‌లలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలకు సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమన్నారు. ప్రమాదంపై డీజీఎంఎస్‌తో విచారణ చేయించి, సేఫ్టీ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్తు శాఖలో ఈ - స్టోర్ విధానం

పెద్దపల్లి, జూలై28: పెద్దపల్లి సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు త్వరగా సేవలనందించడానికి ఈ–స్టోర్ విధానాన్ని అవలంభిస్తున్నామని ఎస్ఈ బొంకూరి సుదర్శన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.కొత్త సాంకేతిక విధానంతో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా 24 గంటల అందిస్తున్నామని ఎస్ఈ తెలిపారు.

## శ్మశానంలో స్వచ్ఛంద సంఘాల నిరసన

కోల్‌సిటీ, జూలై 28: కాటికాడ కష్టాలను చూసి స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు చలించారు. గోదావరిఖని శివారులోని గోదావరిని ఆనుకొని ఉన్న హిందూ శ్మశాన వాటికలో ఆదివారం నిరసన చేపట్టారు. ముందుగా శ్మశాన వాటిక లో వసతులను పరిశీలించారు. ఐక్య వేదిక ప్రతినిధులు గోలివాడ చంద్రకళ, మద్దెల దినేష్, పల్లెర్ల రమేశ్ మాట్లాడారు. గత ప్రభుత్వం శ్మశాన వాటికలను సకల వసతులతో తీర్చిదిద్దడమే గాకుండా రామగుండం నగర పాలక సంస్థ తరపున ఉచితంగా దహన సంస్కారాలు కల్పించిందన్నారు. కానీ, ఇప్పుడు కార్పొరేషన్ అధికారులు ఉచిత దహన సంస్కారాల విషయంలో చేతులెత్తేయడంతో పాటు శ్మశాన వాటికను చీకట్లోకి నెట్టివేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గానీ, సింగరేణి ఆర్జీ–1 జీఎం గానీ స్పందించి ఈ శ్మశాన వాటికకు పూర్వవైభవం తీసుక రావడంతోపాటు ఉచిత దహన సంస్కారాలను పునరుద్ధరించాలని కోరారు. కార్పొరేటర్ శివ, ఐక్య వేదిక సభ్యులు జక్కని శ్రీలత, కొమ్ము చందు, సుద్దాల అనురాజ్, నరేంద్ర, నజీమ, శ్రీలత, నస్రీన్, కంది సుజాత, రమాదేవి, గాదం సరిత, బిల్లా శ్రీదేవి, బోగే లత తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

గోదావరిఖని/కోల్‌సిటీ, జూలై 28: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు రక్షణ కరువైందని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు జీ ఝాన్సీ అన్నారు. గోదావరిఖనిలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం లో ఆదివారం నిర్వహించిన పీవోడబ్ల్యూ జిల్లా ఏడో మహ సభలకు ఆమె హాజరయ్యారు. ముందుగా పీవోడబ్ల్యూ జెండాను ఎగురవేశారు. మహిళ హక్కుల కోసం అమరులను స్మరిస్తూ మౌనం పాటించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచి గాంధీచౌక్ చౌరస్తా, లక్ష్మీనగర్, అశోక్‌నగర్ మీదుగా పెద్ద ఎత్తున మహిళలు ప్రదర్శన జరిగింది. ఇక్కడ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అందె మంగ, జిల్లా అధ్యక్షురాలు కే జ్యోతి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, పీవోడబ్ల్యూ జిల్లా నాయకులు డీ బుచ్చమ్మ, ఈ మంగ, ఎస్ రజిత, కే అమృత, సరోజన, శారద, కే స్వప్న, సత్యమ్మ, స్వర్ణలత, పద్మ, తదితరులు ఉన్నారు.

## ల్యూపస్ వ్యాధితో యువతి మృతి

రామగిరి, జూలై 28: కల్వచర్లకు చెందిన కట్ట సాహితీ అనే యువతి ల్యూపస్ వ్యాధితో శనివారం మృతి చెందింది. గత కొంత కాలంగా ల్యూపస్ వ్యాధితో బాధపడుతున్న సాహితీని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ వెంకటరమణా రెడ్డి పరామర్శించారు.

## నేటి నుంచి లారీ డ్రైవర్ల ఆందోళన

సుల్తానాబాద్, జూలై 28: రైస్ మిల్లు లారీ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి సోమవారం నుంచి ఆందోళనలు చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, వేల్పుల కుమారస్వామి, ఎరవెల్లి ముత్యంరావు పేర్కొన్నారు. ఆదివారం పోగుల తిరుపతి అధ్యక్షత న స్థానిక పెదమ్మ గుడి లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. డ్రైవర్ల వేతనాలు పెంచి,సమస్యలు పరిష్కరించే విషయంలో రైస్ మిల్లు యాజమానుల వైఖరికి నిరసనగా అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని, ధర్నాలు చేస్తామని తెలిపారు.